# వంటిల్లు

**విమల**

ఎంత అద్భుతమైందీ వంటగది
రుచులు రుచులుగా పరిమళాల్ని వెదజల్లుతూ
తెరిచిన తినుబండారాల దుకాణంలా
ఎంత నోరూరిస్తుందో
తాలింపు ఘుమాయింపులతో
పూజా మందిరం అగరొత్తుల సువాసనల్తో
మావంటిల్లు నిత్యం శ్వాసిస్తూ వుంటుంది
వసారాలో చల్లచిలికే చప్పుడుతోనో
అంట్లగిన్నెలు తోమే చప్పుడుతోనో
రోజూ ఉదయమే మా వంటిల్లు మేల్కొంటుంది
అలికి ముగ్గులు దిద్దిన పొయ్యి
మండేందుకు ముస్తాబవుతుంది
వంటింటి పోపుడబ్బాలో చిల్లరపైసలు
దాచుకుతిన్న మిఠాయి వుండలు
పప్పు బెల్లాల్తో ఉత్తుత్తి వంటా, వడ్డెనలు
అమ్మా , నాన్నా ఆటలు...
ఈ వంటిల్లొక వదలని మోహమై
నా బాల్యాన్నంతా చుట్టేసుకుంది
నాకు మా వంటిల్లొక అద్భుత మాయా బజారు.

ఇప్పుడు వంటిల్లొక ఆటస్థలం కాదు
మెల్లిగా బాల్యపు ఛాయలు వదిలిపెడుతుండగానే
ఇక్కడే నన్ను తీర్చిదిద్దటం మొదలైంది
'వంటింటి తనాన్ని' ఇక్కడే నేర్పారు నాకు
మా అమ్మ, అమ్మమ్మా
ఇంట్లో అమ్మలంతా ఇక్కడే 'స్త్రీ' లయ్యారట
గిన్నెలు, డబ్బాలూ, బస్తాలతో
రకరకాల శవాలు నిండిన శ్మశానంలా
మా వంటిల్లు..
తడికట్టెల పొగమేఘాల మధ్య
మా వంటిల్లు వేలాడుతూ వుంటుంది
భయం, భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా వుంటుంది
ఏడ్చి, ఏడ్చి ఆమె కళ్ళు ఎక్కడో కారిపోయాయి
తోమి, తోమి ఆమె చేతులు అరిగిపోయాయి
మా అమ్మకు చేతులు లేవు
ఆమెను చూస్తే
ఒక గరిటగానో, పెనంలానో
మా వంటింటిని అలంకరించిన ఒక పరికరంలానో వుంటుంది

ఒక్కోసారి ఆమె మండుతున్న పొయ్యిలా కూడా వుంటుంది
అప్పుడు బందీ అయిన పులిలా ఆమె
వంటగదిలో అశాంతిగా తిరుగుతుంది
నిస్పృహాయతతో గిన్నెలు ధడాలున ఎత్తేస్తుంది

ఎంత తేలికో, గెరిట తిప్పితే చాలు
వంట సిద్ధం అంటారంతా
తినేందుకు తప్పా ఇటుకేసి రారు ఎవ్వరూ
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా
మా నాన్న పేరే.

అదృష్టవశాత్తూ నేనో మంచి వంటింట్లో పడ్డానన్నారంతా
గ్యాసు, గ్రైండర్లు, సింకులు, టైల్సు...
అమ్మలా గారెలు, అరిసెలు కాక
ఇప్పుడు కేకులు, పుడ్డింగులూ చేస్తున్నాను నేను
ఇంకా గిన్నెలపై పేర్లు మాత్రం నా భర్తవే.

కుక్కరు కూతతోనో, గ్రైండరు మోతతోనో
నా వంటిల్లు మేల్కొంటుంది
నేనొక అలంకరించిన వంట గదిలా
కీ ఇచ్చిన బొమ్మలా ఇక్కడ తిరుగుతూ వుంటాను
నా వంటిల్లొక యంత్రశాలలా వుంది
రకరకాల చప్పుళ్ళతో ఈ వంటిల్లొక కసాయి
దుకాణంలా వుంది
కడిగిందే కడిగి, ఏళ్ళతరబడి, వండీ, వండీ
వడ్డిస్తూ, ఎంగిళ్ళెత్తేసుకుంటూ....
చివరకు నా కలల్లోనూ వంటిల్లే
కళాత్మకమైన వంటింటి కలలు
మల్లెపూవుల్లోనూ పోపు వాసనలే

ఈ వంటింటిని తగలెయ్య
ఎంత అమానుషమైందీ వంటగది
మన రక్తం పీల్చేసి, మన ఆశలనీ కలల్నీ కాజేసి
కొద్ది, కొద్దిగా జీవితాంతం పీక్కుతింటున్న
రాకాసి గద్ద ఈ వంటిల్లు
వంటింటి సంస్కృతి, వంటింటి ముచ్చట్ల
వంటలక్కలమైన మనం,

మనం ఏమైనా మన అంతిమ కర్తవ్యం
'గరిట తిప్పటంగా' చేసిన ఈ వంటిళ్లను
ధ్వంసం చేద్దాం రండి.
ఇక గిన్నెలపై ఎవరిపేర్లూ వద్దు
వేరు వేరు స్వంతపొయిలను
పునాదులతో సహా తవ్వి పోద్దాం రండి.
మళ్ళీ మన పాపలు ఈ వంటరి వంటిళ్ళలోకి
అడుగిడబోతున్నారు.
మన పిల్లలకోసం
వంటరి వంట గదులు కూల్చేందుకు రండి.

\+ ++ +++ +++